

మాట్లాడుతున్న కలెక్టర్, పక్కనే అడిషనల్ కలెక్టర్, ఐటీడీఏ పీవో

ఆరోగ్యంపై జాగ్రత్తలు పాటించాలి

- తాగునీటి ఎద్దడి నివారణ చర్యలు తీసుకోవాలి
- కలెక్టర్ ఇలా త్రిపాఠి

ఏటూరునాగారం, ఏప్రిల్ 6 : గొత్తికోయ గూడేల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని, ఆరోగ్యంపై జాగ్రత్తలు పాటించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. మండలంలోని గుండెంగవాయి గొత్తికోయ గూడాన్ని శనివారం ఆయన ఐటీడీఏ పీవో చిత్ర మిశ్రా, అదనపు కలెక్టర్ శ్రీజ, డీఎంహెచ్‌వో అప్పయ్యలతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా గొత్తికోయలతో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ తాగునీటి సమస్యలు తలెత్తకుండా ఉండేలా చూడాలని ఆర్డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించా రు. గర్భిణులు అంగన్‌వాడీ కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలతో క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. గుంపు ప్రాంతాల్లో ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలు నిరంతరం పర్యవేక్షించాలన్నా రు. గిరిజనులు జీవన విధానం వారి దిన చర్య వేసవి కాలంలో లభ్యమయ్యే అటవీ ఉత్పత్తుల వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి, పరీక్షలు నిర్వహించారు. 25 మందికి మలేరియా, 15 మందికి షుగర్ పరీక్షలు, గర్భిణులకు రక్త పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ సుభాశ్, డీఈఈ వెంకట సతీశ్, ఏఈ మోహన్, గ్రిడ్ అధికారి సంధ్యారాణి, వైద్యాధికారి సుమలత, వైద్య సిబ్బంది, తహసీల్దార్ జగదీశ్వర్, ఎంపీవో కుమార్, ఆర్ఐ కిరణ్, వీఆర్ఏ శంకర్, ఎంపీటీసీ నర్సింహులున్నారు.

అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

ములుగురూరల్: విద్యార్థుల సౌకర్యార్థం ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులు పూర్తి చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. శనివారం కలెక్టరేట్‌లో ప్రభుత్వ పాఠశాలల్లో అభివృద్ధి పనులపై అదనపు కలెక్టర్ శ్రీజతో కలిసి సంబంధిత అధికారులతో కలెక్టర్ రివ్యూ సమావేశం నిర్వహించి మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా 353 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయని, వాటిలో 122 పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. డీఆర్డీవో శ్రీనివాస్‌కుమార్, డీఈవో పాణిని, ఈడీఎం దేవేందర్, పీఆర్, ఆర్‌అండ్‌బీ,అధికారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు రైతుల ఉసురు తాకుతది

- అబద్దపు పునాదుల మీద గద్దెనెక్కిర్రు
- అధికారంలోకి వచ్చాక.. రైతు ఆత్మహత్యలు ఎక్కువైనయ్
- భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి
- తెలంగాణలో పాత టీడీపీ రాజ్యమేలుతుంది
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి



నిరసన దీక్షలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి

కృష్ణకాలనీ, ఏప్రిల్ 6 : అబద్దపు పునాదుల మీద గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీకి రైతుల ఉసురు తాకుతుందని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అవలంభిస్తున్న రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా జిల్లా బీఆర్ఎస్ కార్యాలయంలో భూపాలపల్లి అర్బన్ అధ్యక్షుడు కటకం జనార్దన్‌పటేల్ అధ్యక్షతన నిరసన దీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే గండ్ర, పార్టీ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గండ్ర మాట్లాడుతూ రాష్ట్రంలో ఇంత త్వరగా రైతులకు ఇలాంటి దీన పరిస్థితి వస్తదని ఊహించలేదని, పదేండ్ల కేసీఆర్ పాలనలో రైతులు స్వర్ణయుగం చూశారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు కట్టించి సాగునీరందించారని చెప్పారు. తుపాకి రాముని మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ కాళేశ్వరంలో అవినీతి జరిగిందని కాలక్షేపం చేస్తూ, రైతులకు ఇప్పటికి చుక్కనీరు ఇవ్వలేదన్నారు. అన్నారం బరాజ్ నీళ్లను దిగువకు వదిలి బీఆర్ఎస్‌ను బదునాం చేయాలనే లక్ష్యంతో పాలన చేస్తున్నారన్నారు. దమ్ముంటే అవినీతిని చూపించాలని డిమాండ్ చేస్తే సీఎం రేవంత్‌రెడ్డి దొంగమాటలు చెప్తున్నాడని ఆరోపించారు. సీఎం రేవంత్, ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కాళేశ్వరం ప్రాజెక్టును రిపేరు చేపించి రైతులను నీళ్లివ్వాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలు తుంగలో తొక్కారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 120 రోజుల్లో రైతు ఆత్మహత్యలు ఎక్కువయ్యాయని, ఇప్పటివరకు రైతుబంధు ఇవ్వలేదన్నారు. ఈ విషయమై కాంగ్రెస్ సీనియర్ నేత బక్క జడ్సన్ ప్రశ్నిస్తే ఆయనను పార్టీ నుంచి సస్పెండ్ చేశారన్నారు. బీఆర్ఎస్ పాలనలో విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు తీసుకొస్తే కాంగ్రెస్ పాలనలో కరెంటు పోతున్నదని తద్వారా మోటర్లు కాలిపోతున్నాయన్నారు. అధికారం ఎవరికి శాశ్వతం కాద ని, ఇక్కడ చెల్లని రూపాయిలే నీ దగ్గరకు వస్తున్నాయనే విషయం గుర్తుంచు కోవాలన్నారు. వరంగల్‌లో కడియం కావ్యకు టికెట్ ఇస్తే ఎలాంటి పరిస్థితులు ఎదుర వుతున్నాయో తెలుసుకోవాలని సూచించారు. బీఆర్ఎస్ అప్పుతెచ్చిందని బదునాం చేస్తున్నారని జిల్లాకో మెడికల్ కాలేజీ, కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాన్ని నిర్మించిందని తెలుసుకో వాలన్నారు. రేవంత్ సీఎం అయి 120 రోజుల్లో రూ.20 వేల కోట్ల అప్పు ఎందుకు తెచ్చాడో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత నిరుద్యోగులను మరిచిందన్నారు. గొర్ల స్కీం, కేసీఆర్ కిట్ వంటి స్కీమ్‌లను పూర్తి తీసేశారన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు లబ్ధిదారులను ఎంపిక చేసి డబుల్ బెడ్‌రూమ్‌లు ఇస్తే, వాటిని మార్చేసి, కాంగ్రెస్ నాయకులకు ఇవ్వడంలో అంతర్యమేమిటో ప్రజలకు చెప్పాలన్నారు. నియోజక వర్గానికి 4,500 ఇండ్లు తీసుకొస్తే క్యాన్సిల్ చేశారనీ, డీబీఎం-38 కాల్వ ద్వారా రైతుల నీరిచ్చినట్లు గుర్తు చేశారు. ఇసుక మాఫియా ఎక్కువైందని, అధికారులు నిజాయితీగా పనిచేయాలని సూచించారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపు కోసం కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని పిలుపునిచ్చారు.బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి మాట్లాడుతూ కాంగ్రెస్ గెలిచిన తర్వాత రైతులకు కన్నీళ్లే మిగిలాయన్నారు. నాలుగు నెలల పాలనలో రైతులు రోడ్లపైకి వచ్చి ధర్నాలు చేయడం బాధాకరమన్నారు. కాంగ్రెస్‌లో పాత టీడీపీ రాజ్య మేలుతున్నదని మండిపడ్డారు. కార్యక్రమంలో భూపాలపల్లి మున్సిపల్ చైర్ పర్సన్ సెగ్గం వెంకటరాణి సిద్దు, వైస్ చైర్మన్ గండ్ర హరీశ్‌రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు హింగే మహేందర్ జీ, ఏఎంసీ చైర్మన్ లక్ష్మీనరసింహస్వామి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రమేశ్, ప్రజాప్రతినిధులు, అన్ని మండలాల పార్టీ నేతలు పాల్గొన్నారు.

ఉలిక్కిపడిన అంకుషాపూర్

- కర్రెగుట్ట ఎన్‌కౌంటర్‌లో అన్నె సంతోష్ మృతి?
- 20 యేళ్ల క్రితమే అజ్ఞాతంలోకి..
- శోకసంద్రంలో తల్లిదండ్రులు
- గ్రామంలో విషాదచాయలు

సంతోష్ (ఫైల్)

కాటారం, ఏప్రిల్ 6 : తెలంగాణ- ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌తో అంకుషాపూర్ గ్రామం ఉలిక్కిపడింది. ములుగు జిల్లా కర్రెగుట్టలు-ఛత్తీస్‌గఢ్‌లోని కాంకేర్ పరిధిలో పోలీసులు, మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురుకాల్పులలో ముగ్గురు మావోయిస్టులు మృతి చెందగా వీరిలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం అంకుషాపూర్ గ్రామానికి చెందిన దండకారణ్యం జోనల్ కమిటీ సెకండ్ సీఆర్సీ (సెంట్రల్ రీజినల్ కమిటీ)కమాండర్ అన్నె సంతోష్ అలియాస్ సాగర్ ఉన్నాడని ప్రచారం జరుగడంతో ఆయన కుటుం బ సభ్యులు శోకసంద్రం లో మునిగారు. సాగర్ ప్రస్తుతం మావోయిస్టు పార్టీలో తెలంగాణ ఎస్‌జెడ్‌సీ సభ్యుడిగా, సీఆర్సీ-2 డీవీసీఎం కమాండర్‌గా కొనసాగుతున్నాడు. అన్నె సమ్మక్క-ఐలయ్య దంపతులకు ముగ్గురు కుమారులు సంతోష్, రామ్, లక్ష్మణ్ ఉన్నారు. సంతోష్ 20 యేళ్ల క్రితమే మావోయిస్టు పార్టీలో చేరాడు. అప్పటి నుంచి సంతోష్ అలియాస్ సాగర్ అలియాస్ శ్రీధర్ అనే పేర్లతో మావోయిస్టు పార్టీలో కీలక నేతగా కొనసాగుతున్నాడు. అతని సోదరుడు రామ్ గతంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా లక్ష్మణ్ వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఈ నేపథ్యంలో శనివారం జరిగిన కాల్పుల్లో ముగ్గురు నక్సలైట్లు మృతి చెందగా వారిలో సాగర్ ఉన్నట్లు మావోయిస్టు పార్టీ ప్రకటన జారీ చేసినట్లు సమాచారం. గతంలోనే సంతోష్ జన జీవన స్రవంతిలో కలువాలని అతని తల్లిదండ్రుల ద్వారా కాటారం పోలీసులు ఎన్నో ప్రయత్నాలు చేశారు. ఐతే తల్లిదండ్రులను విడిచి అజ్ఞాతంలోకి వెళ్లిన సంతోష్‌ను ఎప్పటికైనా చూడకపోతామా? అంటూ అతని తల్లిదండ్రులు చాలా కాలంగా ఎదురుచూస్తున్నారు. ఇంతలోనే సంతోష్ ఎన్‌కౌంటర్‌లో చనిపోయాడని తెలియడంతో ఆ తల్లిదండ్రులు తల్లడిల్లిపోతున్నారు. విష యం తెలిసి గ్రామస్తులు అతని తల్లిదండ్రుల వద్దకు వచ్చి ఓదార్చుతున్నా రు. ఐతే పోలీసులు మాత్రం సాగర్ మృతిని ఇంకా అధికారికంగా ధ్రువీకరించలేదు.

అన్నె సంతోష్ తల్లిదండ్రులు

కూలీలకు ఏని దినాలు కల్పించాలి

భూపాలపల్లి కలెక్టర్ భవేశ్‌మిశ్రా

కృష్ణకాలనీ, ఏప్రిల్ 6 : గ్రామాల్లో కూలీలకు ఉపాధి హామీ పథకంలో పనులు కల్పించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ భవేశ్‌మిశ్రా సంబంధిత అధికారులను హెచ్చరించారు. శనివారం కలెక్టరేట్‌లోని ఐడీఓసీ కార్యాయలంలోఉపాధి పనుల కల్పనపై ఎంపీడీవోలు, ఎంపీవోలు, టీసీలు, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పనులకు హాజరవుతున్న కూలీల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జాబ్‌కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి వంద రోజుల పనిదినాలు కల్పించాలన్నారు. ప్రతి గ్రామంలో కనీసం 200 మందికి తగ్గకుండా పనులు కల్పించి, వేతనం రోజుకు రూ.300 చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ కలెక్టర్ భవానీ శంకర్ ప్రసాద్, జడ్పీ సీఈవో విజయలక్ష్మి, డీఆర్‌డీవో నరేశ్‌కుమార్, అదనపు డీర్డీవో పాల్గొన్నారు.

వడదెబ్బతో జాగ్రత్తగా ఉండాలి

వేసవిలో ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో వైద్య, ఆరోగ్య శాఖతో పాటు వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న రెండు నెలలు జిల్లాలో అధిక ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశముందని, జాగత్రలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామ స్థాయిలో ఆశ, ఏఎన్ఎంలకు అత్యవసర వైద్య సేవలపై శిక్షణ ఇవ్వాలన్నారు. ఉష్ణోగ్రతలు పెరిగి విద్యుత్ ట్రాన్స్ ఫార్మార్లు వేడెక్కి కాలిపోయే ప్రమాదం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించాలన్నారు. 0-6 ఏండ్ల లోపు పిల్లలు వేసవితాపంతో మరణిస్తే అందుకు సంబంధించిన పూర్తి నివేదిక ఇవ్వాలన్నారు. రానున్న రెండు నెలలు ఎంతో కీలకమనీ, ప్రతి వారం తమ శాఖపై నివేదికలు తయారు చేసి ఇవ్వాలన్నారు. సమావేశంలో డీఎంహెచ్‌వో డాక్టర్ మధుసూదన్, డీపీవో నారాయణరావు, డీఏవో విజయ్ భాస్కర్, ఉద్యానవన అధికారి సంజీవరావు, విద్యుత్ శాఖ ఈఈ మల్సూర్ నాయక్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ భవేశ్‌మిశ్రా

ఈవీఎంలపై అవగాహన కలిగి ఉండాలి

ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ భవేశ్ మిశ్రా తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని మాంటిస్సోరీ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పీవో, ఏపీవోలకు నిర్వహించిన ఒక్కరోజు శిక్షణ తరగతులను ఆయన పరిశీలించారు. పోలింగ్ విధుల నిర్వహణపై మాస్టర్ ట్రైనర్స్ ఇచ్చే సూచనలపై సమగ్ర అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది మేనేజ్‌మెంట్ నోడల్ అధికారులు శామ్యూల్, అవినాశ్, పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి నారాయణరావు, బీసీ సంక్షేమ శాఖ అధికారి శైలజ, ఆర్డీవో మంగీలాల్ పాల్గొన్నారు.

చెల్పూర్ కేటీపీపీలో రక్తదాన శిబిరం

గణపురం, ఏప్రిల్ 6 : కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్టు ఆవరణలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. సీఈ ముస్త్యాల సిద్ధయ్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. మనిషి జీవితంలో రెండు దానాలు గొప్పవని, అందులో ఒకటి అన్నదానం, మరొకటి రక్తదానమన్నారు. రక్తదానం చేసేందుకు యువకులు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. రక్తదానం చేసిన ఉద్యోగులు, కార్మికులు, సిబ్బందిని సీఈ అభినందించారు. కార్యక్రమంలో కేటీపీపీలోని అన్ని విభాగాల సూపరింటెండెంట్ ఇంజినీర్లు పివీవీ మురళీమోహన్, ఐవీఎల్ కోటేశ్వర్‌రావు, స్టేజ్ -1, సీహెచ్ శ్రీప్రకాశ్, స్టేజ్ -2, రామ్ ముత్యాలరావు సివిల్, జే రామకృష్ణ, కోల్ ప్లాంట్ ఇంజినీర్స్ అసోసియేషన్, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

కృష్ణకాలనీ, ఏప్రిల్ 6 : వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ఈ నెల 12న నిర్వహించే జిల్లా సదస్సును విజయవంతం చేయాలని సీపీఐ, సీపీఎం, సీపీఐఎంఎల్ పార్టీల జిల్లా కార్యదర్శులు కొరిమి రాజ్‌కుమార్, బండు సాయిలు, మారపెల్లి మల్లేశ్ పిలుపునిచ్చారు. శనివారం సీపీఐ జిల్లా కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. దేశంలో నరేంద్ర మోదీ అనుసరిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ఏఐటీయూసీ కొమురయ్య భవన్‌లో జిల్లా సదస్సు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేయనున్న సభకు వామపక్ష పార్టీల రాష్ట్ర నాయకులు పాల్గొంటారన్నారు.

'చదువే జీవితాన్ని మార్చే ఆయుధం'

ఏటూరునాగారం, ఏప్రిల్ 6 : మండలంలోని కొండాయి మండల పరిషత్ పాఠశాలలో మండల కేంద్రానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి సంగం నాగరాజు శనివారం సొంతంగా లైబ్రరీ ఏర్పాటు చేశారు. లైబ్రరీకి అవసరమైన బీరువాతో పాటు ప్రముఖుల జీవిత చరిత్ర పుస్తకాలు, జనరల్ నాలెడ్జ్, ఇతర పుస్తకాలతో పోటీ పరీక్షల పుస్తకాలను ఈ లైబ్రరీలో ఏర్పాటు చేశారు. ఈ పాఠశాలలో చదువులో ప్రతిభ చూపిన విద్యార్థులకు జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ చదువు ఒక్కటే జీవితాన్ని మార్చే ఆయుధమన్నారు. తన జీవితంలో ఎన్నో కష్టాలు ఎదురైనప్పటికీ చదువునే నమ్ముకుని ముందుకు సాగినట్లు తెలిపారు. ఉపాధ్యాయులు బాలాజీ, వెంకటేశ్వర్లు, పర్వతాల కుమారస్వామి, మల్లికార్జున్, వహీద్ పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

ములుగురూరల్, ఏప్రిల్ 6 : ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ చూపాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, ప్రధాన న్యాయమూర్తి ఎస్‌వీపీ సూర్యచంద్రకళ సూచించారు. శనివారం కోర్టులో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా న్యాయ విజ్ఞాన సదస్సుతో పాటు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్య సూత్రాలు పాటిస్తూ సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండేందుకు కృషి చేయాలన్నారు. జడ్జిలు మాధవి, రామ్మోహన్‌రెడ్డి, వైద్యాధికారి నవ్యరాణి, బార్ అసోషియేషన్ అధ్యక్షుడు వినయ్‌కుమార్, కార్యదర్శి సునిల్‌కుమార్, న్యాయవాదులు మహేందర్, స్వామిదాస్, రాజ్‌కుమార్, నర్సిరెడ్డి, మానస, అర్చన, కుమారస్వామి, అశోక్, చంద్రయ్య పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



సురేశ్ (ఫైల్)

కాటారం, ఏప్రిల్ 6 : మండలంలోని బయ్యారం గ్రామానికి చెందిన గద్దె సురేశ్(60) పంట పొలాల్లో అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఎస్సై అభినవ్, స్థానికుల కథనం ప్రకారం.. కొంత కాలంగా సురేశ్‌కు మతిస్థిమితం సరిగా ఉండడం లేదు. ఈ నెల 1న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో ఈ నెల 3న కూతురు సుజాత పోలీస్‌స్టేషన్‌లో తన తండ్రి కనిపించడం లేదని ఫిర్యాదు చేసింది. మూడు రోజులుగా వెతికినా ఆచూకీ లభించ లేదు. శనివారం గ్రామ శివారు పొలాల్లో స్థానికులు సురేశ్ మృత దేహాన్ని గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. వడ దెబ్బకు గురై మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. మృతుడి కూతురు సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆటో బోల్తాపడి ఒకరు..

నరేశ్ (ఫైల్)

మహదేవపూర్, ఏప్రిల్ 6 : ఆటో అదుపు తప్పి బోల్తా పడడంతో ఒకరు మృతి చెందగా, ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండలకేంద్రంలోని అయ్యప్పస్వామి ఆలయ సమీప ప్రధాన రహదారిపై శనివారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. మండలకేంద్రానికి చెందిన ఓ ఆటోలో ముగ్గురు వ్యక్తులు కాటారం నుంచి మహదేవపూర్‌కు వస్తున్న క్రమంలో అయ్యప్పస్వామి ఆలయ సమీపంలో అదుపుతప్పి బోల్తా పడింది. ఆటో డ్రైవర్‌కు, రాపల్లికోటకు చెందిన గడ్డం ఆశయ్యకు స్వల్ప గాయాలు కాగా, సూరారం గ్రామానికి చెందిన పుల్యాల నరేశ్ (21)కు తీవ్ర గాయాలు కాగా వరంగల్ ఎంజీఎంకు తరలిస్తుండగా పరకాల మార్గ మధ్యంలో మృతి చెందాడు.

ఏజెన్సీలో పోలీసుల హైఅలర్ట్

ఏటూరునాగారం/ వాజేడు, ఏప్రిల్ 6 : తెలంగాణ- ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో జరిగిన ఎన్‌కౌంటర్‌లో తప్పించుకున్న నక్సల్స్ తెలంగాణ అటవీ ప్రాంతంలోని సురక్షిత ప్రాంతానికి వచ్చే అవకాశాలు ఉన్నట్లు భావిస్తున్న పోలీసు యంత్రాంగం వాహన తనిఖీలు ము మ్మరం చేస్తున్నది. అనుమానిత వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలుస్తోంది. నిఘా వర్గాలను అప్రమత్తం చేశారు. గొత్తికయ గూడేలపై పోలీసులు నిఘా పెంచారు. ఏటూరునాగారం మండలం ముల్లకట్ట బ్రిడ్జి, వై జంక్షన్, అటవీశాఖ చెక్‌పోస్టు వద్ద పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. గోదావరి తీర ప్రాంతంపై కూడా పోలీసులు నిఘా పెట్టారు. ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని వాజేడు, వెంకటాపురం, ఏటూరునాగారం, చర్ల తదితర ప్రాంతాల్లో పోలీసులు అప్రమత్తమయ్యారు. వాజేడు మండలంలోని చీకుపల్లి వద్ద 163 జాతీయ రహదారిపై ఎస్సై వెంకటేశ్వర్‌రావు, అయ్యవారిపేట వద్ద పేరూరు ఎస్సై రమేశ్ సీఆర్పీఎఫ్ పోలీసులతో కలిసి వాహనాలను తనిఖీ చేశారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంతో పాటు వివిధ ప్రాంతాలకు వచ్చిపోయే వాహనాలను సోదాలు చేశారు. అనుమానితులను ప్రశ్నించి వదిలేశారు. పత్రాలు లేని వాహనదారులకు జరిమానాలు విధించారు.

కాంగ్రెస్ హామీలు అమలు చేయాలి

తాడ్వాయి, ఏప్రిల్ 6 : కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పాటు రైతాంగాన్ని ఆదుకునేందుకు చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు డీ మల్లయ్య డిమాండ్ చేశారు. మండలకేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అధికారమే లక్ష్యంగా అమలుకు సాధ్యం కానీ, హామీలను ఇచ్చి గద్దెనెక్కిందని, అధికారంలోకి వచ్చాక పథకాలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. ఇంద్రా రెడ్డి, నర్సింగరావు, లక్ష్మయ్య, వసంతరావు తదితరులున్నారు.

ఇసుక క్వారీలు ప్రారంభం

మహదేవపూర్, ఏప్రిల్ 6 : మండలంలోని పెద్దంపేట, అంబట్‌పల్లిలో నాలుగు ఇసుక క్వారీలు ప్రారంభమవుతున్నట్లు శనివారం టీఎస్ఎండీసీ పీవో తారకనాథ్‌రెడ్డి తెలిపారు. పెద్దంపేటలోక్వారీ-1, అంబట్‌పల్లిలో 2,3,4 నంబర్‌తో మూడు క్వారీలు మంజూరయ్యాయన్నారు. ఒక్కో క్వారీలో లక్షా యాభై వేల మెట్రిక్ టన్నుల ఇసుక తీసేందుకు టెండర్లు పూర్తయినట్లు చెప్పారు. పెద్దంపేట గోదావరిలో ఇసుక తీసేందుకు రోడ్డు పనులు ప్రారంభమైనట్లు తెలిపారు. క్వారీల్లో పూర్తిగా మనుషులతో తవ్వకాలు జరుగుతాయని వెల్లడించారు.

వేసవి క్రీడా శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలి

ములుగురూరల్, ఏప్రిల్ 6 : జిల్లాలో మే 1 నుంచి నెల రోజుల పాటు వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహించనున్నందున క్రీడాకారులు శిక్షణ కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి తుల రవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 14 ఏండ్లలోపు బాల బాలికలకు వివిధ క్రీడల్లో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. శిబిరాల్లో విద్యార్థులకు, శిక్షణ ఇవ్వడానికి జిల్లాలోని ఆసక్తి గల సీనియర్ క్రీడాకారులు, జాతీయ స్థాయి క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. శిక్షణకు రూ. 4 వేల గౌరవ వేతనంతో పాటు క్రీడా సామగ్రి అందించనున్నట్లు తెలిపారు. శిక్షణను పూర్తి చేసుకున్న బాలబాలికలకు గుర్తింపు పత్రాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తిగల వారు ఈ నెల 20న సాయంత్రం 5 గంటల్లోపు సంక్షేమ భవన్‌లో దరఖాస్తులు అందజేయాలన్నారు. వివరాలకు ఫోన్ నంబర్ 7330326241ను సంప్రదించాలన్నారు.

భూ వివాదంలో వివాహిత హత్య

చిట్యాల, ఏప్రిల్ 6 : భూ వివాదవలో ఓ మహిళ హత్యకు గురైన ఘటన మండలంలోని జడల్‌పేటలో శనివారం రాత్రి జరిగింది. పోలీసులు, గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కామని విజయలక్ష్మి (40), భర్త చిరంజీవి వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నారు. పెద్ద కొడుకు కామని గణేశ్, భర్త చిరంజీవితో భూమి విషయంలో విజయలక్ష్మికి గొడవ జరిగింది. ఈ క్రమంలో ఆమెకు ఉరి వేసి ఉంటారని మృతురాలి చెల్ల అనిత పోలీసులకు ఫిర్యాదు చేసింది. వెంటనే రంగంలో దిగన డీఎస్పీ సంపత్‌రావు, సీఐ మల్లేశ్ యాదవ్ ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. పోలీసులు ప్రాథమిక విచారణలో హత్యగా నిర్ధారించారు. తన ఆరోగ్యం బాగా ఉండడంలేదని విజయలక్ష్మి చెల్లికి చెప్పడంతో శనివారం సాయంత్రం జడల్‌పేటకు వచ్చింది. ఇంటికి వెళ్లగా తలుపులు వేసి ఉండడంతో అత్త కామని వెంకటమ్మను వాకబు చేయగా ఇంట్లోనే ఉంటుంది చూడని చెప్పింది. తలుపులు తీసి చూసేసరికి విజయలక్ష్మి చనిపోయి ఉంది. ఎనిమిదేండ్ల క్రితం ఇలాగే చంపడానికి ప్రయత్నించారని, భర్త చిరంజీవి, పెద్ద కుమారుడు గణేశ్‌పై చర్యలు తీసుకోవాలని మృతురాలి చెల్లి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. దర్యాప్తులో ఎస్సై ఎండీ శాఖాన్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

jobs Apply Now!

★Wardens (Female)-4, Telecallers-2, Attractive Salary for deserved candidates. Contact: SUVIDYAA Jr. College, for girls, Nakkalagutta, HNK, Cont: 8885599155, 8885599166, NTW-323235

★Wanted Agents, Associates